జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజా జ్యోతి
ప్రతి అక్షరం - ప్రజాల కోసం
నిజామాబాద్
బుధవారం 25 డిసెంబర్ 2024 www.prajajyothinews.com పేజీలు :04

## క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపిన కలెక్టర్



**ప్రజాజ్యోతి నిజామాబాద్ ప్రతినిధినిజామాబాద్,** డిసెంబర్ 24 : క్రిస్మస్ వేడుకలను పురస్కరించుకుని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. యేసుక్రీస్తు జన్మించిన ఈ శుభ దినాన అందరికీ శాంతి, సౌభాగ్యాలు చేకూరాలని ఆకాంక్షించారు. ఈ క్రిస్మస్ వేడుక ప్రతి ఒక్కరి జీవితంలో సంతోషం నింపాలని, ఇంటింటా ఆనందపు కాంతులు వెల్లివిరియాలని, అన్ని రంగాలలో నిజామాబాద్ జిల్లా మరింత ప్రగతి సాధించాలని అభిలషించారు.

# కేజీబీవీ పాఠశాలను తనిఖీ చేసిన కలెక్టర్



**ప్రజాజ్యోతి నిజామాబాద్ ప్రతినిధి:నిజామాబాద్, డిసెంబర్ 24 :** ఆర్మూర్ మండలం పెర్కిట్ లో గల కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. డార్మెటరీ, స్టోర్ రూమ్, కిచెన్, ప్లే గ్రౌండ్ తదితర వాటిని పరిశీలించారు. స్టోర్ రూమ్ లో నిల్వ ఉంచిన సన్నబియ్యం, ఇతర సరుకుల నాణ్యతను, విద్యార్థుల కోసం వండిన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ పట్టికలో పొందుపర్చిన వాటికి అనుగుణంగానే ఆహార పదార్థాలు ఉన్నాయా అని తనిఖీ చేశారు. పర్యవేక్షణ అధికారిణి ఎక్కడ ఉన్నారని కలెక్టర్ ప్రశ్నించగా, సమ్మెలో పాల్గొంటున్నారని డ్యూటీ టీచర్ తెలిపారు. బాధ్యత కలిగిన వారు అందుబాటులో ఉంటూ పాఠశాల నిర్వహణను పక్కాగా పర్యవేక్షించాలని, విద్యార్థినులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. మెనూ ప్రకారం ప్రతిరోజూ ఉడకబెట్టిన కోడిగుడ్లు అందిస్తున్నారా అని ఆరా తీశారు. భోజనం తయారు చేసేందుకు వినియోగించే ఆహార పదార్థాలు, సరుకులు, కూరగాయలు కలుషితం కాకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని నిర్వహకులకు సూచించారు. సరుకులను స్టీల్ డబ్బాలలో నిల్వ ఉంచి, తప్పనిసరిగా వాటికి మూతలు బిగించాలని, కూరగాయలు, ఇతర సరుకులను నేలపై ఉంచకూడదని హితవు పలికారు. విజయ కంపెనీ వంటనూనె, విజయ డైరీ పాలను వినియోగించాలని సూచించారు.నాసిరకమైన బియ్యం, ఇతర ఆహార పదార్థాలు, కూరగాయలు సరఫరా చేసిన సమయంలో అధికారులకు సమాచారం అందించాలన్నారు. విద్యార్థినుల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు జరిపించాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట ఆర్మూర్ ఆర్డీఓ రాజాగౌడ్ తదితరులు ఉన్నారు.

## నగరంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు భూమిపూజ చేసిన అర్బన్ ఎమ్మెల్యే

- సీసీ రోడ్, డ్రైనేజీ పనులు నాణ్యతతో, త్వరతగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కాంట్రాక్టర్లను అధికారులను ఆదేశించిన -ఎమ్మెల్యే ధన్ పాల్



## సైబర్ నేరాలను నియంత్రించాలి

**క్రైమ్ సిబ్బందికి అవగాహన కార్యక్రమం డీసీపీ( అడ్మిన్ ) బస్వారెడ్డి**



ప్రజాజ్యోతి నిజామాబాద్ క్రైమ్:సాంకేతిక పరిజ్ఞానంతో పెరిగిపోతున్న సైబర్ నేరాలను నియంత్రించేందుకు కృషి చేయాలని డిసిపి బస్వా రెడ్డి సూచించారు.తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ హైదరాబాద్ వారి ఆదేశాల మేరకు ఇంచార్జీపోలీస్ కమీషనర్ సింధూశర్మ సూచనల మేరకు మంగళవారం జిల్లా పోలీస్ కమీషనరేట్ కార్యాలయంలోని

# శిశు గృహంలో మూడు నెలల పసికందు మృతి






ప్రజాజ్యోతి నిజామాబాద్ ప్రతినిధి:నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని సుభాష్ నగర్ ప్రాంతంలో గల శిశు గృహంలో మూడు నెలల పసికందు మృతి చెందింది. ఈ విషాదకర సంఘటన మంగళవారం ఉదయం చోటుచేసుకుంది. గత సెప్టెంబర్ 15వ తేదీన జిల్లా ఆస్పత్రిలో స్వతంత్ర అనే పసికందు జన్మించింది. ఓ మతిస్థిమితం లేని అమ్మాయి పెళ్లి కాకుండానే గర్భం దాల్చింది. 9 నెలలు నిండచడంతో ఆమెను జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించగా పాపకు జన్మనిచ్చి చెత్త బుట్టలో పడేసి వెళ్ళిపోయింది. అనంతరం అధికారులు శిశువును స్వాధీనం చేసుకుని సంరక్షణ కోసం శిశు గృహానికి తరలించారు. శిశు గృహంలో స్వతంత్ర అనే పసికందు అస్వస్థకు గురి కావడంతో శిశు గృహ సిబ్బంది పాపను చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి ఆఫీస్ విషమించి మంగళవారం ఉదయం శిశువు మృతి చెందింది. అయితే శిశువు మృతి చెందడం పై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్లే పాప చనిపోయినట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. శిశు గృహ లో మొత్తం 24 మంది పిల్లలు ఉండగా వారికి సరైన వైద్యం అందించే డాక్టర్ పరిరక్షణ లేకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిలువుటద్దంగా మారింది. ప్రస్తుతం శిశు గృహ లో 23 మంది చిన్నారులు ఉన్నారు. వైద్యుల పర్యవేక్షణ లేకపోవడం వల్లే పాప చనిపోయినట్లు ప్రచారం జరుగుతుంది. శిశు గృహంలో చిన్నారులకు రక్షణ లేకుండా పోయిందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### విశ్రాంత జీవితాన్ని సమాజానికి ఉపయోగించాలి



ప్రజాజ్యోతి నిజామాబాద్ ప్రతినిధి: పెన్షనర్లు ఉద్యోగంలో ఉన్న వారికి మార్గదర్శులని మీ విశ్రాంత జీవితాన్ని సమాజానికి ఉపయోగించాలని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో అన్నారు. మంగళవారం బోధన్ లో తెలంగాణా ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ బోధన్ డివిజ న్ ఆధ్వర్యం లో నేషనల్ పెన్షనర్ డే వారోత్సవాలలో భాగం గా పెన్షనర్స్ డే జరిగింది. ఈ కార్యక్రమంలో అదన పు కలెక్టర్ మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగులు లకు ఏ సమస్యలు వున్న వాటి పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. డివిజన్ అధ్యక్షుడు కృష్ణారావు మాట్లాడుతూ పెన్షన్ భిక్ష కాదు, పెన్షన్ ఎవరి దయా దక్షిణ్యలతో ఇచ్చేది కాదు. పెన్షన్ అనేది హక్కు అని పెన్షనర్ తన 30 సంవత్సరా లకు పైగా చేసిన సేవలకు వారు రిటైర్ అయిన తరువాత గౌరవ ప్రద జీవనానికి ఇచ్చేది అని చెప్పారు. అనంతరం జిల్లా నాయకులు ఈవీఎల్ నారాయణ, సిర్ప హనుమండ్లు, శిర్ప లింగం, బోధన్ డివిజన్ సీనియర్ పెన్షనర్స్ ను సన్మానిం చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మదన్మోహన్, అద్దంకి ఉషాన్, డివిజన్ కార్యదర్శి జ్ఞానేశ్వర్, ప్రకాశం, సత్యానంద్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## సావిత్రి బాయి పూలే పురస్కారాల కరపత్రాలను ఆవిష్కరించిన ఎమ్మెల్యేలు



ప్రజాజ్యోతి నిజామాబాద్ ప్రతినిధి:బిసిటియు ఆధ్వర్యంలో జనవరి 5 వ తేదీన న్యూ అంబేద్కర్ భవనం లో నిర్వహించనున్న సావిత్రి బాయి పూలే పురస్కారాల కరపత్రాలను నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్య నారాయణ, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే ఆర్ భూపతి రెడ్డి వారి కార్యాలయాలలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశం లోనే స్త్రీ విద్య ను మొట్టమొదటి సారిగా ప్రవేశపెట్టిన ఘనత పూలే దంపతులకు దక్కుతుందని, వారిని ఉపాధ్యాయులు ఆదర్శంగా తీసుకుని బోధన చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బిసి ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు మాడవేడి వినోద్ కుమార్, ప్రధాన కార్యదర్శి ఆర్ గోపాలకృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్ కంచరి రవికుమార్, కొట్టూరు రామకృష్ణ, అసోసియేటెడ్ అధ్యక్షులు ఎ మోహన్, గౌరవ అధ్యక్షులు కైరంకొండ బాబు, రాష్ట్ర ఉపాధ్యక్షులు సతీష్, గౌరవ సలహాదారులు రమణ స్వామి తదితరులు పాల్గొన్నారు.



## క్రీడాకారులను అభినందించిన ఎంపీడీవో అనంత రావు







ప్రజాజ్యోతి నిజామాబాద్ ప్రతినిధి:ఇందల్వాయి మండల్ ఎంపీడీవో అనంత రావు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నవీన్ గౌడ్ మొన్న నిజామాబాద్ లో జరిగినటువంటి జిల్లా స్థాయి సీఎం కప్ టోర్నమెంట్లో ఇందల్వాయి మండలం కబడ్డీ మహిళా జట్టు ప్రథమ స్థానం. కబడ్డీ పురుషుల జట్టు ద్వితీయ స్థానం. వాలీబాల్ పురుషుల జట్టు ద్వితీయ స్థానం సాధించడం పట్ల సంతోషం వ్యక్తం చేయడంతో పాటు క్రీడాకారులను అభినందించడం జరిగింది. అనంతరావు ఎంపీడీవో స్వతగా వాలీబాల్ క్రీడాకారుడైనందున రాష్ట్రస్థాయిలో సెలెక్ట్ అయిన వాలీబాల్ క్రీడాకారులకు వారి ప్రయాణ ఖర్చుల కొరకు 3000 అమౌంట్ అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పీడీలు సురేష్. భూపతి రాజేశ్వర్. వి రాజ్ కుమార్. శృతి. సాయి రాధ. సునీత. సుష్మలు పాల్గొన్నారు

## నగరంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు భూమిపూజ చేసిన - అర్బన్ ఎమ్మెల్యే

ప్రజాజ్యోతి నిజామాబాద్ బ్యూరో: నిజామాబాద్ నగరంలోని 7వ డివిజన్ చంద్ర నగర్ లో , 17వ డివిజన్ గౌతమ్ నగర్ లో , 35వ డివిజన్ హమాల్వాడీ లో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా లిఅర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ మున్సిపల్ నగర మేయర్ నీతు కిరణ్ గారితో పాల్గొని భూమి పూజ చేయడం జరిగింది... ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతు జనరల్ ఫండ్ ద్వారా ప్రతి డివిజన్ కు పదిలక్షల రూపాయలు మంజూరు చేయ డం జరిగిందని అన్నారు అందులో భాగంగా నగరంలో పలు డివిజన్లో అభివృద్ధి కార్యక్రమాలు సీసీ రోడ్, డ్రైనేజ్ నిర్మాణ పనులకు నేడు శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు.సీసీ రోడ్, డ్రైనేజ్ నిర్మాణ పనులు నాణ్యతతో ఎటువంటి జాప్యం లేకుండా త్వరతగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కాంట్రాక్టర్లను, అధికారులను ఆదేశించడం జరిగింది. నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గం అభివృద్దే లక్ష్యంగా నియోజకవర్గం అభివృద్ధి కొరకు తగిన నిధులు మంజూరు చేయాలనీ ఇంచార్జ్ మంత్రి జూపల్లి గారికి, ముఖ్యమంత్రి రేవంత్ గారి దృష్టికి తీసుకుపోవడం



జరిగిందన్నారు..నగర అభివృద్ధికి 100 కోట్లు ప్రతేక నిధులు విడుదల చేయాలనీ రాష్ట్రప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు,గెలిచి ఏడాది గడుస్తున్న ఎమ్మెల్యేగా తనకు రావలిసిన సొంత నిధులు కూడా రాలేదని అన్నారు వెంటనే వాటిని కూడా విడుదల చేయాలనీ అన్నారు..ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు 7 వ డివిజన్ సుక్క మధు గారు, 17 వ మాయావర్ సవిత గారు,35 వ డివిజన్ ఎర్రం సుధీర్ గారు,తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాలను నియంత్రించాలి

## క్రైమ్ సిబ్బందికి అవగాహన కార్యక్రమం

## డీసీపీ( అడ్మిన్ ) బస్వారెడ్డి





ప్రజాజ్యోతి నిజామాబాద్ క్రైమ్: సాంకేతిక పరిజ్ఞానంతో పెరిగిపోతున్న సైబర్ నేరాలను నియంత్రించేందుకు కృషి చేయాలని డిసిపి బస్వా రెడ్డి సూచించారు.తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ హైదరాబాద్ వారి ఆదేశాల మేరకు ఇంచార్జీపోలీస్ కమీషనర్ సింధూశర్మ సూచనల మేరకు మంగళవారం జిల్లా పోలీస్ కమీషనరేట్ కార్యాలయంలోని కాన్ఫ రెన్స్ హాల్‌లో సైబర్ క్రైమ్ సిబ్బందికి చైతన్యం చేయడం కోసం అదనపు పోలీస్ కమీషనర్ (అడ్మిన్) జి. బస్వారెడ్డి పర్యవేక్షణలో సైబర్ క్రైమ్ ఏసీపీ వై. వెంకటేశ్వర రావు అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీ (అడ్మిన్) మాట్లాడుతూ....సాంకేతిక వినియోగం ఎక్కువ కావడంతో సైబర్ నేరాల సంఖ్య అదే స్థాయిలో పెరిగి పోయిందన్నారు., సైబర్ నేరాలకు చెక్ పెట్టడం, సైబర్ క్రైమ్ సిబ్బంది సమర్ధవంతంగా సేవలందించడం లక్ష్యంగా పని చేయాలని తెలిపారు. సైబర్ క్రైమ్ సిబ్బంది గ్రామ, గ్రామాన అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ఈ మధ్య కాలంలో డిజిటల్ అరెస్టు అని చాలా ఫోన్లు వస్తున్నందున్న, అసలు డిజిటల్ అరెస్టులు అనేది ఎక్కడ లేదన్నారు. పోలీస్ శాఖ ప్రత్యేకంగా కార్యాచరణ రూపొందించి 1930 ద్వారా కూడా సైబర్ క్రైమ్ రిపోర్ట్ చేయవచ్చని తెలిపారు. భాదితులు డబ్బులు పోయిన వెంటనే ఫిర్యాదు చేయడానికి ముందుకు రావాలన్నారు. మోసపూరిత లావాదేవీలు జరిగిన వెంటనే ఫిర్యాదు చేస్తే వాటిని తక్షణం నిలిపి వేసి సంబంధిత వారి ఖాతాను ఫ్రీజు చేసే విధంగా చూడాలన్నారు. సైబర్ నేరాల కేసుల్లో పూర్తి స్థాయి ఆధారాలను సేకరించి, నేరస్థులను గుర్తించాలని చెప్పారు. వారికి శిక్ష పడేలా చేయడం తద్వారా భాధితులకు న్యాయం చేయాలని సూచించారు. నిజామాబాద్ పోలీస్ కమీషనరేట్ పరిధిలోని నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ల లలో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సైబర్ క్రైమ్ పోలీసులు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యాక్రమంలో ఏసీపీ రాజా వెంకట్ రెడ్డి, టౌన్ సీఐ శ్రీనివాస్ రాజ్, డిచ్‌పల్లి సీఐ మల్లేష్ సైబర్ పోలీస్ స్టేషన్ సీఐ ముకీద్ పాషా, పోలీస్ సిబ్బంది, సైబర్ క్రైమ్ సిబ్బంది పాల్గొన్నారు.

# బీసీల సంక్షేమ పథకాలకు ప్రభుత్వం తూట్లు

## కామారెడ్డి బిసి డిక్లరేషన్ అమలు కోసం పోరాటం చేస్తా ం. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత స్పష్టీకరణ



ప్రజాజ్యోతి నిజామాబాద్ ప్రతినిధి:కామారెడ్డి డిక్లరేషన్ పేరిట బీసీలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరిస్తోందని, హామీల అమలు కోసం పోరాటం చేస్తామని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా బీసీలకు ఒక్క హామీ కూడా అమలు చేయకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. మరీ ముఖ్యంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కల్పనను ఎగవేసే ప్రయత్నం చేస్తే ఊరుకోబోమని హెచ్చరించారు.మంగళవారం నాడు తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర నాయకులు మరియు విశ్వకర్మ కుల సంఘాల నాయకులు ఎమ్మెల్సీ కవితను తన నివాసంలో కలిశారు. తమకు ఇచ్చిన హామీల అమలు కోసం ప్రభుత్వంపై ఒత్తిడి చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ... బీసీల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కులవృత్తులను కుదేలు చేస్తున్నదని విమర్శించారు. కుల వృత్తుల వారికి ప్రభుత్వం కనీస మద్దతు ఇవ్వడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. అత్యధికంగా బీసీ విద్యార్థులు లబ్దీపొందే ఫీజు రియింబర్స్ మెంట్, పూలే స్కాలర్ షిప్ పథకాల నిధుల విడుదలలో ప్రభుత్వం జాప్యం చేయడం వల్ల వారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. బీసీలు ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఐక్యతను చాటి హామీల అమలుకు ప్రభుత్వాన్ని నిలదీద్దామని చెప్పారు.కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు అన్యాయం చేస్తే బీఆర్ఎస్ పార్టీ చూస్తూ ఊరుకోబోదని హెచ్చరించారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో బీసీల కోసం అనేక విప్లవాత్మక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టాలని, ఇప్పుడు వాటికి కాంగ్రెస్ ప్రభుత్వం తూట్లు పొడిచే ప్రయత్నం చేస్తున్నదని మండిపడ్డారు. ఇప్పటి వరకు బీసీ సంక్షేమానికి ఎంత ఖర్చు చేశారని చెప్పాలని ప్రభుత్వాన్ని ఎమ్మెల్సీ కవిత డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో యునైటెడ్ ఫులే ఫ్రంట్ నాయకులు బొల్లా శివ శంకర్ , తెలంగాణ ముదిరాజ్ మహాసభ నాయకులు కొట్టాల యాదగిరి ముదిరాజ్ , దాసరి నరేష్ ముదిరాజ్ , నాగభూషణం ముదిరాజ్ , భిక్షపతి ముదిరాజ్ , విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్ చీఫ్ ఫౌండర్ విశ్వనాథుల పుష్పగిరి, జాతీయ సహాయ కార్యదర్శి చొల్లేటి ప్రభాకర్, అబ్బోజు రామ్ సుధాకరాచారి, హేమ జిల్లోజు, స్థపతి, యూత్ వింగ్ కార్యదర్శి నరేష్ చారి తదితరులు పాల్గొన్నారు.

## కేజీబీవీ పారశాలను తనిఖీ చేసిన కలెక్టర్





